క్లుప్తంగా

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

మెట్‌పల్లిరూరల్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను తక్షణమే విడుదల చేయాలని ఏబీవీపీ మెట్‌పల్లి కార్యదర్శి మారుతి అన్నారు. గురువారం ఏబీవీపీ నాయకులు విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికి 7,500కోట్లకు పైగా బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అరుణ్, పుతిన్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం నుంచి హైదరాబాద్‌కు బస్సు ప్రారంభించాలి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం నుంచి హైదరబాద్‌కు, మెట్‌పల్లి నుంచి వయా గోధూర్, ఇబ్రహీంపట్నం, ఎర్గట్ల ద్వారా నిర్మల్ బస్సును ప్రారంభించాలని మండల ప్రజలు కోరుతున్నారు. కరోనాకు ముందు మెట్‌పల్లి డిపోకు చెందిన బస్సులను ఇబ్రహీంపట్నం నుంచి హైదరాబాద్, నిర్మల్‌కు నడిపేవారని, కరోనా వచ్చిన తర్వాత ఈ బస్సులను బంజేసి మళ్లీ ప్రారంభించలేదని వారు వాపోతున్నారు.

పారిశుధ్యం, పరిశుభ్రతపై శ్రద్ధ చూపాలి

పెగడపల్లి: గ్రామాల పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణపై శ్రద్ధ చూపాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీవో మహేందర్‌తో కలిసి పంచాయతీ కార్యదర్శులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాలవారీగా ప్లాంటేషన్, శానిటేషన్, సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణకు తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. ఏపీవో అనిల్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

ధర్మపురి: విద్యుత్ సమస్యల పరిష్కారానికి పట్టణంలోని విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయం వద్ద శుక్రవారం విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డివిజనల్ ఇంజినీర్ రాజిరెడ్డి తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు నిర్వహిస్తున్నామని, విద్యుత్ సమస్య ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి



మల్యాలలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మౌనిక

మల్యాల: డెంగీ జ్వరం, చికెన్ గున్యా, టైఫాయిడ్ వంటి వ్యాధులకు స్థానిక ఆస్పత్రిలో వైద్య పరీక్షలు అందుబాటులో ఉన్నాయని, రోగులు ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యురాలు మౌనిక అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం సుమారు 120 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పీహెచ్ఎన్ నాగలక్ష్మి, స్టాఫ్ నర్సు మణి మాధురి ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ



శ్రీకాంత్

పెగడపల్లి: మండల వ్యవసాయధికారిగా ఓరుగంటి శ్రీకాంత్ నియామకమయ్యారు. గురువారం విధుల్లో చేరి బాధ్యతలు స్వీకరించారు. మూడేళ్లుగా ఇక్కడ పూర్తిస్థాయి ఏవో లేక ఇన్‌చార్జి ఏవోలతో నెట్టుకొచ్చారు.



సాయికిరణ్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

వెల్గటూర్: వెల్గటూర్, ఎండపల్లి మండలాల నూతన వ్యవసాయ అధికారులుగా పెండ్యాల సాయికిరణ్, కమల్ల మహేశ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఏఈవోలు శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. రామన్న, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



సింధూజ

ధర్మపురి: ధర్మపురి వ్యవసాయ కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారిణి సింధూజ గురువారం బాధ్యతలు చేపట్టారు.

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల వ్యవసాయాధికారులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. సారంగాపూర్ వ్యవసాయాధికారిగా ప్రదీప్‌రెడ్డి, బీర్‌పూర్ వ్యవసాయాధికారిగా రాజ్‌కుమార్ విధుల్లో చేరారు.

అసంపూర్తి వంతెనలకు మహర్దశ

- నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- కోరుట్ల నియోజకవర్గంలో కొనసాగనున్న పనులు



అసంపూర్తిగా కోరుట్ల-సంగెం వంతెన

కోరుట్ల రూరల్: గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కోరుట్ల నియోజకవర్గంలోని కోరుట్ల, మెట్‌పల్లి, మల్లాపూర్ మండలాల్లో వాగులపై వంతెనల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పనులను ప్రారంభించింది. కోరుట్ల మండలంలో కోరుట్ల-సంగెం, యెఖీన్‌పూర్-సంగెం గ్రామాల మధ్య పెద్ద వాగుపై వంతెనలు, మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్-రాంరావుపల్లె, కొండ్రికల్ల-కోనాపూర్, మల్లాపూర్ మండలంలోని మల్లాపూర్-ఒడ్డెరకాలనీ వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరు కాగా.. పనులు నత్తనడకగా నడిచి సామగ్రి ధరలు భారీగా పెరగటంతో నిధులు చాలక పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఇంజినీరింగ్ అధికారులు గత ప్రభుత్వానికి కొత్తగా ప్రతిపాదనలు పంపినా.. సార్వత్రిక ఎన్నికల కారణంగా నిధుల మంజూరులో జాప్యం జరిగి పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ రహదారుల కోసం భారీగా నిధులు మంజూరు చేయగా.. అందులో కోరుట్ల నియోజకవర్గంలోని 5 వంతెనల నిర్మాణం కోసం పంచాయతీరాజ్ నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం జీవో ఆర్‌టీ నం.606 విడుదల చేసింది.

ఏ వంతెనకు ఎంతంటే..

కోరుట్ల మండలంలోని యెఖీన్‌పూర్-సంగెం పెద్దవాగుపై వంతెనకు రూ.1.50కోట్లు, కోరుట్ల-సంగెం(జంబిగద్దె) వంతెనకు రూ.3.80కోట్లు, మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్-రాంరావుపల్లె వంతెనకు రూ.2.80కోట్లు, మెట్‌పల్లి మండలం కొండ్రికల్ల-కోనరావుపేట వంతెనకు రూ.4కోట్లు, మల్లాపూర్ మండలం మల్లాపూర్-ఒడ్డెరకాలనీ వంతెనకు రూ.2.20కోట్లు మొత్తం రూ.14.30కోట్లు పంచాయతీరాజ్ నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఈనెల 10న జీవో ఆర్‌టీ నం.606 విడుదల చేసింది. కోరుట్ల నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న 5 వంతెనలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయగా.. ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, కాంగ్రెస్ కోరుట్ల ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు రాష్ట్ర పంచాయతీ రాజ్ మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు.

క్షేత్రస్థాయిలో పరిశీలన



చెట్ల వివరాలు తెలుసుకుంటున్న అటవీ శాఖ అధికారులు

సారంగాపూర్: రోళ్లవాగు ప్రాజెక్టు ఆధునికీకరణలో అటవీ శాఖ ముంపు భూమిలో ఎన్ని చెట్లకు నష్టం జరుగుతుందన్న విషయంపై రోళ్లవాగు ప్రాజెక్టు డీఈ చక్రూనాయక్, అటవీ శాఖ రేంజర్ శ్రీనాథ్ గురువారం క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలన జరిపారు. ప్రాజెక్టు ఆధునికీకరణలో ఇంజినీరింగ్ అధికారులు నష్టపోయిన చెట్ల కొలతలు, చెట్ల సంఖ్య చూపిన వివరాల్లో ఏమైనా తేడాలున్నాయన్న దానిపై మరోసారి ఇరు శాఖల అధికారులు పరిశీలించారు. కొన్ని చెట్ల కొలతలు సరిగా లేవని అటవీ శాఖ అభ్యంతరం వ్యక్తం చేయడంతో.. వాటి కొలతలను మళ్లీ సేకరిస్తున్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో నష్టపోయిన చెట్ల వివరాలను తీసుకునేటప్పుడు తప్పనిసరిగా ఇరు శాఖల అధికారుల పర్యవేక్షణలో జరిగేలా చర్యలు తీసుకుంటామని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదు



వెల్గటూర్: ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

వెల్గటూర్: పీఆర్‌టీయూటీఎస్ ఆధ్వర్యంలో మండలంలో గురువారం టీచర్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టినట్లు మండల అధ్యక్షుడు సీహెచ్ నర్సింగం తెలిపారు. మండలంలోని అన్ని జెడ్పీ హైస్కూళ్లలో ఉపాధ్యాయులకు ఫామ్ 19, అనెక్షర్ 2 అందజేసి ఓటర్ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీధర్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రభాకర్, విమలాదేవి, రాజేశ్వర్, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల: కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదు చేసుకోవాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆనందరావు అన్నారు. గురువారం ఓల్డ్ హైస్కూల్‌లో ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ప్రధాన కార్యదర్శి యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలు జమున పాల్గొన్నారు.

మల్లాపూర్: ఉపాధ్యాయుల, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఓటు హక్కు కోసం అర్హులు తమ పేర్లు నవంబర్ 6 లోగా నమోదు చేసుకోవాలని పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు లక్కిడి శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పీఆర్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో పర్యటించి ఓటరు నమోదు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఎంఈవో దామోదర్‌రెడ్డి, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు ఎనుగందుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి దేశరాజ్ రాజేశ్, రాష్ట్ర బాధ్యులు కోగిల కృష్ణ, కుంబాల శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింగరావు, మండల బాధ్యులు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత కోరుట్ల



వాలీబాల్ జట్లతో మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ సురేశ్‌బాబు

కోరుట్ల: కోరుట్ల పోలీస్ సర్కిల్ పరిధిలో గంజాయి, మాదకద్రవ్యాలు, ఇతరత్రా చెడు వ్యసనాలపై యువతలో చైతన్యం కల్పించాలనే లక్ష్యంతో గురువారం నిర్వహించిన వాలీబాల్ టోర్నీలో కోరుట్ల విజేతగా నిలిచింది. కోరుట్లకు విన్నర్ కప్, కథలాపూర్ మండలం ఊట్‌పల్లి జట్టుకు రన్నర్ కప్‌ను డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు అందించారు. సీఐ సురేశ్‌బాబు, పీఈటీలు భారీ, రాజు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మల్యాల: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మల్యాల సర్కిల్ పరిధిలోని మల్యాల, కొడిమ్యాల, పెగడపల్లి మండలాల పరిధిలోని యువకులతో మల్యాల మండల కేంద్రంలో పోలీసుల ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నీ నిర్వహించారు. పెగడపల్లి జట్టు విజేతగా నిలవగా.. డీఎస్పీ రఘుచందర్ ట్రోఫీ అందజేశారు. డీఎస్పీ రఘుచందర్, మల్యాల, పెగడపల్లి, కొడిమ్యాల ఎస్సైలు నరేశ్‌కుమార్, రవికిరణ్, సందీప్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు

కథలాపూర్: దుంపేట గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదానికి కారణమైన దూలూర్ గ్రామానికి చెందిన మారంపెల్లి అభిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ గురువారం తెలిపారు. ఈనెల 14న అభి బైక్‌పై వెళ్తూ ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్ర గాయాలపాలయ్యారు. అభిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సీసీ రోడ్డుకు నిధులు మంజూరు

మేడిపల్లి: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పోరుమల్ల గ్రామం నుంచి రాయికల్ మండలం అయోధ్య గ్రామాలను కలిపే 1.5కిలోమీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.2కోట్ల నిధులు మంజూరు చేసినట్లు మండల అధ్యక్షుడు ఏనుగు రమేశ్‌రెడ్డి తెలిపారు. రెండు గ్రామాల ప్రజల చిరకాల కోరికను దృష్టిలో పెట్టుకొని నిధులు మంజూరు చేసినందుకు బీసీ సెల్ మండల అధ్యక్షుడు మాదం వినోద్ వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కొండపూర్ గ్రామంలోని సీతారాముల గుడికి వెళ్లేందుకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.83లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు.

వాల్మీకి జయంతి



భీంరాజ్‌పల్లిలో నివాళి అర్పిస్తున్న నాయకులు

గొల్లపల్లి: భీంరాజ్‌పల్లి గ్రామంలో వాల్మీకి జయంతి నిర్వహించారు. వాల్మీకి మహర్షి జీవిత చరిత్ర అందరికీ ఆదర్శనీయమని వాల్మీకి సంఘం నేతలు బొమ్మెన వెంకటేశం, కంది వెంకటేశం అన్నారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మాజీ సర్పంచ్ సత్యనారాయణ, అభయాంజనేయస్వామి ఆలయ చైర్మన్ కుమార్, నాయకులు కంది స్వామి, సింగారపు దొంగయ్య, రేవెల్ల లింగయ్య, దూస రవి, కంది సత్తయ్య, తక్కళ్ల భూమయ్య పాల్గొన్నారు.

మరమ్మతు పనులు ప్రారంభం

జగిత్యాలరూరల్: కొద్ది రోజుల క్రితం కురిసిన వర్షాలకు తీవ్ర వరద రావడంతో అనంతారం గ్రామ శివారులో జాతీయ రహదారిపై ఉన్న రోడ్డాం ధ్వంసమైంది. జాతీయ రహదారి వెంట వెళ్లే భారీ వాహనాలతోపాటు చిన్న వాహనదారులు కూడా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎట్టకేలకు అధికారులు గురువారం మరమ్మతు పనులను ప్రారంభించారు.

పసుపు పంటకు తెగులు



యామపూర్‌లో పసుపు పంటను పరిశీలిస్తున్న ఏవో రాజ్‌కుమార్

ఇబ్రహీంపట్నం: పసుపు పంటకు మర్రకు తెగులు, దుంప ఈగ ఆశిస్తోందని మండల వ్యవసాయ అధికారి ఆకు రాజ్‌కుమార్ తెలిపారు. గురువారం యామపూర్ గ్రామంలో పసుపు పంటలను పరిశీలించారు. నివారణకు ఏ మందులు వాడాలో రైతులకు వివరించారు. ఏఈవో సాగర్, రైతులు గడ్డం శంకర్‌రెడ్డి, నల్ల మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన తప్పనిసరి

సారంగాపూర్: ఎయిడ్స్‌పై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో గంగాధర్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన ఎయిడ్స్ అవగాహన సదస్సులో మాట్లాడారు.

పశువులకు టీకాలు వేయించాలి



పశువులను పరిశీలిస్తున్న నరేశ్

జగిత్యాల: గాలికుంటు వ్యాధి ప్రాణాంతకమైందని, ప్రతీ ఒక్కరు పశువులకు టీకాలు వేయించాలని పశుసంవర్ధక శాఖ ఏడీ నరేశ్ అన్నారు. గురువారం పొలాస గ్రామంలో తెల్ల జాతి పశువులు, గేదెలకు టీకాలు వేశారు. ఇది వైరస్ వ్యాధి అని, సూక్ష్మ జీవుల వల్ల పశువులకు ప్రబలి అధిక జ్వరం, నోట్లో పొక్కులతో మేత మేయలేని పరిస్థితుల్లో ఉంటాయన్నారు. కల్లెడ ఇన్‌చార్జి వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ హిమజ, వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ కందుకూరి పూర్ణచందర్, రాజేశ్ పాల్గొన్నారు.

అసంక్రమిత వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మల్లాపూర్: అసంక్రమిత వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎన్సీడీ జిల్లా ప్రోగ్రాం అధికారి అర్చన అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. వైద్య సిబ్బంది ప్రతినెలా వ్యాధిగ్రస్తుల ఇంటికి వెళ్లి ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికేబుల్ డిసీస్) కిట్లను అందించాలని సూచించారు. పీహెచ్‌సీ మెడికల్ అధికారి వాహిని, సీహెచ్‌వో రామ్మోహన్, హెచ్‌ఈవో ఇందిర, హెల్త్ సూపర్‌వైజర్ ప్రభావతి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ చిత్రపటానికి క్షీరాభిషేకం

రాయికల్: చెర్లకొండాపూర్, ఇటిక్యాల గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చిత్రపటానికి ఆయా గ్రామాల నాయకులు క్షీరాభిషేకం చేశారు.

అధిక ధరలకు ఎరువుల విక్రయం

వెల్గటూర్: మండల కేంద్రంలోని కొందరు ఫెర్టిలైజర్ షాపు యజమానులు నిబంధనలు అతిక్రమించి అక్రమ వ్యాపారం నిర్వహిస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు అదనంగా సుమారు రూ.50 వరకు అధిక ధరలకు ఎరువుల విక్రయం నిర్వహిస్తున్నారు. పీవోఎస్ మిషన్ ద్వారా ఎరువులు విక్రయించాలని అధికారులు చెబుతున్నా.. అధికారుల ఆదేశాలు బేఖాతర్ చేస్తూ ఎటువంటి రశీదులు లేకుండా ఇష్టానుసారం విక్రయాలు జరుగుతున్నాయి. గ్రౌండ్ స్టాక్, స్టాక్ రిజిస్టర్, పీవోఎస్ మిషన్‌కు మధ్య స్టాక్ వ్యత్యాసముంటోంది. అన్నీ తెలిసినా అధికారులు మాత్రం మామూలుగా చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. వ్యాపారస్తులు అధిక ధరలకు విక్రయించి రైతులను పీల్చి పిప్పి చేస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన ఓ బడా వ్యాపారవేత్త బాహాటంగానే ఎటువంటి రశీదులు లేకుండా ఎరువులు విక్రయిస్తున్నా.. ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యమేమిటో అధికారులకే తెలియాలి.



సారంగాపూర్: పెంబట్ల గ్రామం నుంచి రైతులు పొలాలు, గ్రామ పెద్దమ్మ ఆలయానికి వెళ్లేందుకు ఏడాది క్రితం పనులు ప్రారంభిస్తున్నట్లు నాయకులు శిలాఫలకం వేశారు. శాసన సభ ఎన్నికల ముందు ఈ రహదారి నిర్మాణానికి రూ.55లక్షల వ్యయంతో భూమిపూజ చేసి శిలాఫలకం వేసినా.. ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. పెంబట్ల గ్రామ రైతులు ప్రస్తుతం లక్ష్మీదేవిపల్లి గ్రామం మీదుగా 5 కిలోమీటర్లు ప్రయాణించి పెద్దమ్మ ఆలయ సమీపంలోని తమ పంట పొలాలకు వెళ్తున్నారు. చెరువు గట్ల మీది నుంచి ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే కేవలం కిలోమీటరులోనే పంట పొలాలకు చేరుకోవచ్చు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
మిలింద్, డీఈ, పంచాయతీరాజ్ శాఖ, సెల్ నంబర్: 7995565871

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639, 9440061630, 9705346643



శ్రీవేంకటేశ్వరస్వామి రథోత్సవం

కథలాపూర్: గంభీర్‌పూర్ గ్రామంలో గురువారం శ్రీవేంకటేశ్వరస్వామి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు అందుకున్న స్వామివారు రథంపై ఆశీనులయ్యారు. అనంతరం రథోత్సవం ప్రధాన వీధుల గుండా జరిగింది. మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. భక్తులకు అన్నదానం చేశారు. అర్చకుడు మాధవచార్యులు, మాజీ ఎంపీపీ జవ్వాజి రేవతి, మాజీ సర్పంచ్ పోతు సింధూజ, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండ



బాధిత కుటుంబానికి బ్యాంక్ పత్రాల అందజేత

మెట్‌పల్లిరూరల్: వెల్లుల గ్రామానికి చెందిన పుల్ల రాజు, జుంగుల గంగాధర్ మృతిచెందగా.. బాధిత కుటుంబాలకు అమెరికా గ్రేటర్ అట్లాంటా తెలంగాణ సొసైటీ సభ్యులు అండగా నిలిచారు. రాజు కుటుంబానికి రూ.లక్ష, గంగాధర్ కుటుంబానికి రూ.50వేల నగదు బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించారు. ఫిక్స్‌డ్ డిపాజిట్‌కు సంబంధించిన పత్రాలను గురువారం అందజేశారు. నవీన్‌కుమార్, తిరుపతి, శంకర్‌గౌడ్, పెద్ద గంగారాం, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్: పేదవాడికి వైద్యమందించడానికి అబుదాబిలో ఉంటున్న కొల్వాయి గ్రామానికి చెందిన యువకులు ఆర్థిక సాయమందించారు. బుగ్గారం మండలం సిరికొండ గ్రామానికి చెందిన పంచిత లక్ష్మణ్ కొన్ని రోజుల క్రితం డెంగీతో తీవ్ర అనారోగ్యం పాలయ్యాడు. ప్రతిరోజు చికిత్స కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రిలో రూ.25వేలు ఖర్చవుతుంది. విషయం తెలిసిన బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామానికి చెందిన అబుదాబిలో ఉంటున్న యువకులు రూ.10వేలు లక్ష్మణ్ చికిత్స కోసం పంపించారు.

సెలవులో ఆర్డీవో

జగిత్యాల: జగిత్యాల ఆర్డీవో మధుసూదన్ ఐదు రోజులపాటు సెలవులో వెళ్లనున్నారు. కోరుట్ల ఆర్డీవో శ్రీనివాస్‌కు జగిత్యాల ఇన్‌చార్జి ఆర్డీవోగా బాధ్యతలు అప్పగించారు.

ప్రజాసమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎండీ పాషా



ఎండీ పాషాను అభినందిస్తున్న నాయకులు

జగిత్యాల: తెలంగాణ రాష్ట్ర చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రజాసమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జగిత్యాలకు చెందిన ఎండీ పాషాను నియమించారు. జగిత్యాల పట్టణ అధ్యక్షుడు రాజేశ్, మహ్మద్, రామాంజనేయులు, శ్రీనాథ్ హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు అభినందన

జగిత్యాల: జిల్లాస్థాయి కళోత్సవ్ పోటీల్లో కేజీఆర్, చైతన్య స్కూల్‌కు చెందిన విద్యార్థులు సోలో విభాగంలో వైష్ణవి, ఇన్‌స్ట్రుమెంటల్ విభాగంలో తరుణి ప్రతిభ కనబర్చగా.. విద్యాసంస్థల డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి వారిని అభినందించారు. రాష్ట్రస్థాయిలో సైతం రాణించాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ సనత్, శారద పాల్గొన్నారు.

ఘనంగా దీపోత్సవం

జగిత్యాలటౌన్: కనకదుర్గ సేవాసమితి ఆధ్వర్యంలో దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. అష్టలక్ష్మి దేవాలయ ఆవరణలో నిర్వహించిన దుర్గా శరన్నవరాత్రుల్లో భాగంగా గురువారం సాయంత్రం నిర్వహించిన దీపోత్సవంలో మాతలు పెద్ద సంఖ్యలో పాల్గొని మోతె చెరువులో దీపాలు వదిలారు.

ఉపాధిహామీ పథకం గ్రామసభలు

కథలాపూర్: భూషణరావుపేట, కథలాపూర్ గ్రామాల్లో ఉపాధిహామీ పథకంపై గురువారం గ్రామసభలు నిర్వహించారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో చేపట్టాల్సిన పనులపై చర్చించారు. ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఎంపీడీవో శంకర్, కార్యదర్శులు సాయినాథ్, ఎండీ గఫూర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాహనాల దారి మళ్లింపు

జగిత్యాలరూరల్: అనంతారం గ్రామ శివారులో జాతీయ రహదారిపైనున్న రోడ్డాం మరమ్మతు పనులను చేపడుతుండగా.. జాతీయ రహదారిపై వచ్చే వాహనాలను అధికారులు దారి మళ్లించారు. భారీ వాహనాలు రావడంతో గుల్లపేట గ్రామంలో గురువారం రాత్రి ట్రాఫిక్ జామై పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. ధర్మపురి నుంచి వచ్చే వాహనాలను గుల్లపేట, అర్పపల్లి, లక్ష్మీదేవిపల్లి మీదుగా జగిత్యాలకు మళ్లించారు. జగిత్యాల నుంచి వెళ్తున్న వాహనాలను తిప్పన్నపేట, హైదర్‌పల్లి, పెంబట్ల, లక్ష్మీదేవిపల్లి మీదుగా దారి మళ్లించారు.